క్లుప్తంగా

సప్త కనికలమ్మ సేవలో మంత్రి



హారతి అందుకుంటున్న మంత్రి, ఎమ్మెల్యే

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం దొడ్డిపల్లెలోని శ్రీసప్త కనికలమ్మను మంగళవారం రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం మంత్రికి అమ్మవారి దీపం అందజేశారు. ఆ తర్వాత మంత్రిని పలువురు సన్మానించారు. మంత్రి వెంట చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఉన్నారు.

గణనాథునికి పట్టు వస్త్రాలు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న కేశువులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వినాయక స్వామికి రిటైర్డ్ దేవదాయశాఖ ఏడీసీ కేశువులు మంగళవారం పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం ఆయన కుటుంబసభ్యులతో కలిసి పట్టువస్త్రాలు తీసుకొచ్చారు. వారికి ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మూలస్థానంలోని గణనాథుని చెంత పట్టువస్త్రాలు ఉంచి పూజలు చేసి దర్శనం కల్పించారు.

● అభినందన



సత్యవతికి నగదు బహుమతి అందజేస్తున్న హెచ్ఎం రమేష్

చిత్తూరు కలెక్టరేట్ : 5కే రన్ పోటీల్లో ప్రతిభ చాటిన 9వ తరగతి విద్యార్థిని సత్యవతిని గిరింపేట మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం రమేష్ మంగళవారం అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఎయిడ్స్ ఫ్రీ ఇండియా కార్యక్రమాన్ని పురస్కరించుకుని అపోలో ఆస్పత్రి నిర్వాహకులు 5–కే రన్ పోటీలు నిర్వహించారని చెప్పారు. ఆ పోటీల్లో పాల్గొన్న తమ స్కూలు విద్యార్థిని సత్యవతి మొదటి స్థానంలో నిలిచి రూ.5 వేలు బహుమతి కైవసం చేసుకుందని తెలిపారు. హెచ్ఎంతోపాటు టీచర్లు సత్యవతిని అభినందించారు.

ఉపాధి పనుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

తవణంపల్లె: తవణంపల్లె, ఎగువ తవణంపల్లె పంచాయతీల్లో చేస్తున్న ఉపాధి పనులను మంగళవారం ఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహేశ్వర్‌రెడ్డి, డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం పరిశీలించారు. అనంతరం తవణంపల్లె ఉపాధి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఏపీఓ లలిత పాల్గొన్నారు.

గ్రామాల్లో మరింత అభివృద్ధి



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

పూతలపట్టు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్ అన్నారు. మంగళవారం పోలవరం గ్రామ సచివాలయంలో గ్రామసభను నిర్వహించారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విజయవంతం చేయాలని సూచించారు. ఎంపీటీసీ కృష్ణమ్మ, సర్పంచ్ నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, నిరంజన్ రెడ్డి, మణి పాల్గొన్నారు.

ఈఓపీఆర్డీ బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసులకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: పూతలపట్టు నూతన ఈఓపీఆర్డీగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎంపీడీఓ గౌరి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను ఎంపీడీఓ గౌరి, పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. శ్రీనివాసులు వైఎస్సార్‌జిల్లా పెద్దముడియం మండలంలో గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ, ప్రమోషన్‌పై పూతలపట్టుకు వచ్చారు.



ఎ.కొత్తకోటలో కంటి అద్దాల పంపిణీ



తుంబగానిపల్లెలో కంటి అద్దాలు అందజేస్తున్న నేతలు

జగనన్న సురక్ష.. ప్రజలకు శ్రీరామరక్ష

బంగారుపాళెం: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్ అన్నారు. మండలంలోని జిల్లేడుపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని తంబుగానిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. 550 మంది రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంతకుముందు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు ఎలాంటి ఖర్చులేకుండా మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అనంతరం వృద్ధులకు కంటి వెలుగు పథకం ద్వారా ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. సర్పంచ్ భారతి, ఎంపీటీసీ శంకర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ అనీల్‌కుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగ్రాయన్, నేతలు అశోక్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: గుండ్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ రెడ్డెమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు బుజ్జిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, నేత రాజారత్నంరెడ్డి, ఎంపీడీఓ నాగరాజు, ఈఓపీఆర్డీ కుసుమకుమారి, వైద్యులు ప్రవీణ్‌కుమార్, పూర్ణలత, శరవణకుమార్, రామ్‌ప్రకాష్, కెజియరాణి, పంచాయతీ కార్యదర్శి బేబి పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: కె.పట్నంలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక క్యాంపును ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శోభారెడ్డి, సర్పంచ్ పుష్పలత ప్రారంభించారు. వైద్యులు ధాత్రేయచౌదరి, డాక్టర్ ప్రియాంక, మోహన్‌వేలు, వినయ్‌కుమార్, రమణరావు, కల్పన వైద్యపరీక్షలు చేశారు. ఐసీడీఎస్ ఐరాల సీడీపీఓ నిర్మల ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ సరళకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు చేసిన వంటలు, తాజా కూరగాయలు, ఆకుకూరల స్టాళ్లను ప్రదర్శించారు. ఎంపీడీఓ అబ్దుల్‌కలాం, తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: పి.కొత్తకోట పంచాయతీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. తహసీల్దార్ విజయభాస్కర్, సర్పంచ్ పద్మజారాణి, ఎంపీటీసీ దేవిక, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి జరీనా పాల్గొన్నారు.



కె.పట్నంలో ఆరోగ్య సురక్ష ప్రారంభిస్తున్న నేతలు



ఐరాలలో..



తవణంపల్లె: వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

కాలనీలలో విద్యుత్ పనులు వేగవంతం

చిత్తూరు రూరల్: జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పన పనులు పలుచోట్ల పూర్తయ్యాయని, మరికొన్ని చోట్ల శరవేగంగా చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎస్ఈ క్రిష్ణారెడ్డి తెలిపారు. చిత్తూరులోని అనుపల్లె జగనన్న కాలనీని మంగళవారం ఆయన పరిశీలించారు. కాలనీకి విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటును పరిశీలించారు. ఈ ప్రాంతంలో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులను ఈ నెల 25వ తేదీలోపు పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కాలనీలో విద్యుత్ సర్వీసులు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని లబ్ధిదారులకు తెలిపారు. అలాగే గిరింపేటలో నూతనంగా నిర్మిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ పద్మనాభ పిళ్లై, డీఈ శేషాద్రి పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం బీఎన్ఆర్‌పేట ఐటీఐలో పలు కోర్సుల్లో చేరడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సాంబమూర్తి తెలిపారు. కోపా, మెకానికల్ డీజిల్, ఎలక్ట్రీషియన్, మెకానికల్ మోటర్ వెహికల్, డీమెన్ సివిల్ కోర్సులు ఉన్నాయన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు వీటికి అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు www.iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈనెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులు 9వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు మేయర్ అముద ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్–అఫిషియో సభ్యులు హాజరు కావాలని కోరారు.

అటవీ సంపద కాపాడుకోవడం అందరి బాధ్యత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం శ్రీవాణి

పులిచెర్ల(కల్లూరు): వన్యప్రాణులు, అటవీ సంపదను కాపాడుకోవడం అందరి బాధ్యతని డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ జయశంకర్ అన్నారు. మంగళవారం కల్లూరు హైస్కూల్లో అటవీశాఖ వన్యప్రాణి వారోత్సవాల కార్యక్రమం నిర్వహించింది. పర్యావరణ పరిరక్షణ అటవీ సంపద పరిరక్షణపై ఆధారపడి ఉందని జయశంకర్ చెప్పారు. అడవులు, వన్యప్రాణులపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తాతయ్య, హెచ్ఎం శ్రీవాణి, అటవీ శాఖ సిబ్బంది శ్రీదేవి, రెడ్డి ప్రసాద్, లావణ్య, శంకరప్ప ఉపాధ్యాయులు వెంకటసిద్ధులు, రాజేంద్ర, రాజశేఖర్, వేణుగోపాల్, స్నేహమాలిని పాల్గొన్నారు.



పలమనేరు : మాట్లాడుతున్న ఎఫ్ఎస్వో శివన్న

పలమనేరులో..

పలమనేరు: పలమనేరు ఫారెస్ట్ రేంజి అధికారులు పట్టణ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జాతీయ వన్యప్రాణి వారోత్సవాలను నిర్వహించారు. స్థానిక ఎఫ్ఆర్వో శివన్న మాట్లాడుతూ అడవుల్లోని వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పలమనేరు కౌండిన్య అభయారణ్యంలో ఇటీవల ఏనుగులు కరెంట్ షాక్‌లకు గురై మృతిచెందడం బాధాకరమన్నారు. రైతులు సైతం తమ పొలాల వద్ద కరెంట్ తీగలను ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఇప్పటికే ట్రాన్స్‌కో అధికారులతోనూ చర్చించామన్నారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ మొహమూద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్వో సుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ముత్తుకూరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం ముత్తుకూరులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9 గంటలకు ఇది ప్రారంభమవుతుందని, గ్రామస్తులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగ్గురు ఉత్తమ టీచర్ల ఎంపిక



లోకనాథరెడ్డి



కృష్ణయ్య



రమణారెడ్డి

రొంపిచెర్ల: మండలం నుంచి ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని వైఎస్సార్ కడప జిల్లా జెడ్పీ చైర్మన్ ఏ.అమరనాథరెడ్డి సమాచారం ఇచ్చినట్లు ఎంఈఓ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు లోకనాథరెడ్డి, కృష్ణయ్య, కమ్మోళ్లపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రమణారెడ్డి విద్యాభివృద్ధికి చేసిన కృషికి గుర్తింపుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారని, ఈ నెల 5న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా జెడ్పీ కార్యాలయంలో వీరికి అవార్డులను ప్రదానం చేస్తారని తెలియజేశారు.

ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం



కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఉభయదారులు

కాణిపాకం(యాదమరి): సిద్ధి బుద్ధి, సమేత వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలకు మంగళవారం ఆలయ అర్చకులు శేఖర్ గురుకుల్ క్షీరాభిషేకం నిర్వహించారు. రాత్రి చంద్రప్రభ వాహన ఉభయదారులు ఉదయం క్షీర కలశాలను ఊరేగింపుగా అలంకార మండపంలోకి తీసుకొచ్చారు. ఆలయ అధికారులు ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చి మండపంలో కొలువుదీర్చారు. అనంతరం అర్చకులు ఉత్సవ విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు, సురేష్ పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం

వైఎస్సార్ సీపీలో జనసేన కార్యకర్తల చేరిక



పార్టీలో చేరిన జనసేన నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్సీ భరత్

కుప్పం: గుడుపల్లె మండలం గుత్తార్లపల్లెకు చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి భరత్ ఆహ్వానించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఏ ఎండకా గొడుగు పట్టే నైజం అని తన మాటల్లో చాటుకున్నారని, టీడీపీని తిట్టినంత కాలం తిట్టి, ఇప్పుడు ఆ పార్టీతో జతకట్టి, పార్టీశ్రేణులకు షాక్ ఇచ్చారని, ఆయనకు ఒక అజెండా గానీ, సిద్ధాంతం అంటూ లేదని తేలిపోయిందన్నారు. అందుకే ఆ పార్టీకి గుడ్‌బై చెప్పామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు, కులాలకతీతంగా నవరత్న పథకాల ఫలాలను అర్హులకు అందచేస్తుండడంపై ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్టు చెప్పారు. పార్టీలో చేరిన వారిలో మండల జనసేన సహాయ కార్యదర్శులు శేఖర్, ధర్మతేజ, కార్యకర్తలు చంద్రకిరణ్, మోహన్, తరుణ్‌కుమార్, మదన్‌మోహన్, హేమరాజ్ , కిరణ్‌కుమార్, వినోద్, హేమంత్, మరికొందరు ఉన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



పౌరాణిక నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక ప్రత్యేక ఉత్సవాలలో ఆలయ ఆస్థాన మండపంలో మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాకారులు చేసిన భరతనాట్యం, కూచిపూడి, భక్తి గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



భరతనాట్యం చేస్తున్న కళాకారులు



హరికథ చెబుతున్న భాగవతారిణి





నాట్యం చేస్తున్న కళాకారులు

9న టిడ్కో గృహ ప్రవేశాలు



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, అధికారులు

● ఇళ్లను పరిశీలించిన కలెక్టర్ షణ్మోహన్

పుంగనూరు: పట్టణ సమీపంలోని గూడూరుపల్లెలో నిర్మించిన 1,532 టిడ్కో గృహాలను ఈనెల 9న ప్రారంభించనున్నట్టు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన టిడ్కో గృహాలను సందర్శించారు. రోడ్లు, విద్యుత్, పైపులైన్లు, నీటి ట్యాంకుల నిర్మాణాల పనులను పరిశీలించారు. పేదలందరికి ఇల్లు కార్యక్రమంలో భాగంగా మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నియోజకవర్గంలో గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా చేయనున్నట్టు చెప్పారు. మిగిలిన గృహ నిర్మాణ పనులను లబ్ధిదారులతో త్వరితగతిన పూర్తి చేయించి, ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్‌తోపాటు ఎస్ఈ జాన్‌సైమన్‌రావు, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా కూడా గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పద్మనాభం, ఎస్ఈ చంద్రశేఖర్, మెప్మా పీడీ రాధమ్మ, మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ సీతారామన్ పాల్గొన్నారు.

చల్లగా చూడు గంగమ్మ తల్లీ..

పెనుమూరు(కార్వేటినగరం) : అందరినీ చల్లగా చూడు గంగమ్మ తల్లీ అని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అమ్మవారిని వేడుకున్నారు. మండలంలోని జట్టివాని ఒడ్డు గ్రామంలో గంగమ్మ ఆలయంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న మహా కుంభాభిషేకం వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే 2024 ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం కావాలని వేడుకున్నట్లు తెలిపారు. జగనన్న పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, ఈ సువర్ణ పాలన రాష్ట్రంలో ఇలాగే కొనసాగాలని అమ్మవారిని కోరుకున్నట్లు మంత్రి చెప్పారు. అంతకుముందు ఆయన అమ్మవారిని దర్శించుకోగా, ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు పలికి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, నాయకులు మోహన్, మధురెడ్డి, యతీశ్వర్‌నాయుడు, రామకృష్ణారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, బూత్‌కమిటీ నియోజకవర్గం కన్వీనర్ నారాయణరెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ దాము పాల్గొన్నారు.



గంగమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి